ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 19 జనవరి 2024 | 5

రేపు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు కంపెనీల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. వివరాలకు ఫోన్ 7660823903ను సంప్రదించాలన్నారు. యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఇదే కోరుపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు

నేనున్నాను.. నేవిన్నాను.. నేచూశాను.. మీ కష్టాలు తీరుస్తాను.. ఇదీ సుమారు ఐదేళ్ల కిందట సీఎం జగన్ మాట.. అంతా నిజమనుకున్నారు.. ఒక్క ఛాన్స్ అంటే ఓటేసి అధికారం కట్టబెట్టారు.. ఇంకేముంది మన సమస్యలన్నీ జగనన్న చూసుకుంటాడని అనుకున్నారు.. ఐదేళ్లయిపోతుంది.. ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు.. ఊళ్లు అయితే మరీ అధ్వానంగా తయారయ్యాయి.. కనీసం నడవడానికి రోడ్లు లేవు.. మురుగు వెళ్లడానికి డ్రెయినేజీలు లేవు.. పరిష్కరించుకుందామంటే నిధులూ లేవు.. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ సర్కారు దారి మళ్లిస్తుంటే గ్రామాల్లో సమస్యలు కాక ఇంకేముంటాయి.. సంక్రాంతికి పండుగకు ఎక్కడెక్కడి నుంచో పల్లెలకు వచ్చిన బంధువులు మన జిల్లాలో రోడ్లు చూసి ఈ రోడ్లపై ఎలా నడుస్తున్నారని ఆశ్చర్యపోయారంటే పరిస్థితి ఎంత 'దారి'ద్ర్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇక డ్రెయినేజీలను చూసి ముక్కుమూసుకున్నారు.. వై ఏపీ నీడ్స్ జగన్.. నువ్వే మా నమ్మకం జగన్ అంటే ఇదేనా అంటూ సమస్యలను చూసి ప్రశ్నిస్తున్నారు.. ఒకసారి మన జిల్లాలో పల్లెలు ఎలా ఉన్నాయో చూసొద్దాం రండి మరి..!



చిడిపిలో ఈ భవనాల నిర్మాణం ఎప్పుడో

జగనన్నా ఒకసారి చూడన్నా!?

ఊరు..మారలేదు!

- ఐదేళ్లలో అభివృద్ధి సున్నా
- రోడ్లు లేవు.. డ్రెయినేజీల్లేవ్
- అసంపూర్తిగా నిర్మాణాలు
- అందని ఆర్థిక సంఘం నిధులు
- జిల్లాలో ఇదీ పల్లెచిత్రం



కోరుమిల్లిలో ఇదే డ్రెయినేజీ



చిడిపిలో రోడ్డు పక్కనే డంపింగ్‌యార్డ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల జగన్ పాలనలో ఊరుమారలేదు. ఊరు రూపురేఖలు మారలేదు.. అయితే సర్కార్ చేస్తున్న ప్రచారంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఊళ్లలో కనీసం రోడ్లు వేయలేదు. డ్రెయిన్లు పట్టించుకోలేదు. పారిశుధ్యమూ అధ్వానంగానే ఉంది. వానాకాలంలో గ్రామాల్లో మసలలేని పరిస్థితి ఏర్పడింది. శీతాకాలంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇక వేసవి వస్తే తాగునీటికి కటకటే. జిల్లాలో 300 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రభుత్వం వచ్చిన తర్వాత పన్నులు మాత్రం పెంచారు. రోడ్లు వేయలేదు. విస్తరించలేదు.ఎక్కడైనా ఒకటో అరో రోడ్డు వేసినా బెరమ్స్ పట్టించుకోలేదు. జిల్లాలో నాడు-నేడు కింద కట్టిన వివిధ శాఖల భవనాలు చాలా చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి.హడావిడిగా కొన్ని నిర్మించినా తాళాలు తీయడం లేదు. కేవలం అలంకరణ ప్రాయంగానే మిగిలాయి. కడియం మండలంలో మేజర్ పంచాయతీ కడియపులంకకు కనీసం డ్రెయినేజీ వ్యవస్థలేదు. ఇళ్ల ముందు గోతులు తవ్వుకుని మురుగునీరు పారిస్తారు. మరో మేజర్ పంచాయతీ దివాన్‌చెరువులో కూడా డ్రైనేజి వ్యవస్థలేదు. దివాన్‌చెరువు, శ్రీరామపురం, రఘునాథపురంలో మురికిని రోడ్లపైకి వదిలేస్తారు. జిల్లాలో అనేక పంచాయతీలకు సరైన రోడ్లు లేవు. ఊరు మారిందంటే.. అక్కడ రోడ్లు బాగుండాలి. డ్రైనేజీ వ్యవస్థ ఉండాలి. అపారిశుధ్యం ఉండకూడదు. జిల్లా మధ్య నుంచి గోదావరి ప్రవహిస్తున్నా ఇప్పటికీ గోదావరి నీళ్ల సమీప గ్రామాలకు కూడా లేవు. ఊరును మార్చడానికి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిందేమీ లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను మింగేస్తోంది. కొత్తగా ఏర్పడిన కొన్ని పంచాయతీలకు భవనాలు కూడా లేవు. ఐదేళ్లుగా ఊరు మారిందేంలేదు. సమస్యలతో ఊరు అలసిపోయింది. పరిష్కరించమని గోల పెడుతోంది. కనీస సౌకర్యాలు కల్పించాలని మొరపెడుతోంది.

సమస్యలకు కేరాఫ్ కోరుపల్లి

నిడదవోలు, జనవరి 18 : ఆ గ్రామంలో ఎటు చూసినా దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలే దర్శనమిస్తాయి.. అవి చూసిన వారు అబ్బో అనుకుంటారు.. తీరా గ్రామంలో అడుగుపెడితే అసలు విషయం బోధపడుతుంది. అదేమిటంటే అభివృద్ధి అడుగు కూడా పడలేదని అదే నిడదవోలు మండలంలోని కోరుపల్లి.. సుమారు 2000 జనాభా కలిగిన ఆ గ్రామం అభివృద్ధిలో వెనుకబడి పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లుగా శిలాఫలకాలే తప్ప అభివృద్ధి జాడలేదు. గ్రామంలో ప్రధాన రోడ్లు మొదలుకొని అంతర్గత రోడ్లు అధ్వానమే. ఇక పారిశుధ్యం సంగతి చెప్పనక్కర్లెద్దు..

టీడీపీ గెలిస్తేనే పల్లెల అభివృద్ధి

వైసీపీ రెబల్ అభ్యర్థిగా గెలవడంతో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కక్ష కట్టారు. కనీసం అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలేదు. దీని కారణంగానే మూడు నెలల కిందట టీడీపీలో చేరా. గ్రామం అభివృద్ధి చెందాలంటే టీడీపీ రావాలి.

- గుత్తుల నాగలక్ష్మి, కోరుమిల్లి సర్పంచ్



చిడిపిలో..చింతే!

కొవ్వూరు, జనవరి 18 : హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. అయినా ఆ గ్రామంలో అభివృద్ధి అడు గుపడలేదు. అదే కొవ్వూరు మండలంలోని చిడిపి గ్రామం. నియోజకవర్గ కేంద్రానికి 10 కి.మీ. దూరంలో గ్రామం ఉన్నా పట్టించుకునే నాథులే లేరు. అభివృద్ధి సున్నా.. రోడ్లు లేవు, డంపింగ్ యార్డు లేదు. ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ గ్రామమే కాదు మండలంలో 16 గ్రామాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి.

వీధి దీపాలు వెలిగించలేని దుస్థితిలో ఉన్నాం..

గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిదులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో కనీసం వీధి దీపాలు వెలిగించలేని దుస్థితికి చేరుకున్నాం. గ్రామంలో డ్రైనేజీలు లేవు, చెత్తను వేయడానికి డంపింగ్ యార్డు లేదు. గత నాలుగున్నరేళ్లలో చిడిపి అభివృద్ధిలో మార్పు లేదు. - పాలడుగుల లక్ష్మణరావు, సర్పంచ్, చిడిపి





రోడ్డేదన్నా : ఇదే కరిచర్లగూడెం ప్రధాన రహదారి

కష్టాల్లో కరిచర్లగూడెం

గోపాలపురం, జనవరి 18 : మండలంలోని కరిచర్లగూడెం ఒక కుగ్రామం. ఊరి జనాభా కేవలం 1729 మంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉందని ఆ గ్రామ ప్రజలు వైసీపీకి చెందిన అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపించారు. రాష్ట్రంలోనూ, గ్రామంలోనూ అధికార పార్టీకే పట్టం కడితే ఆ గ్రామం ప్రగతిపథంలో పరుగులుపెడుతుందని ఆశించిన ఆ గ్రామ ప్రజలకు ఎదురైంది నిరాశే. జాతీయ రహదారికి సుమారు పర్లాంగు దూరంలో ఉన్న బీటీ రోడ్డు కూడా నిర్మించుకోలేని దుస్థితి ఆ పంచాయతీకి దాపురించింది. నాడు-నేడు ఫేజ్-2లో రూ.36 లక్షలతో మంజూరైన పాఠశాల భవనం అరకొర నిధుల కారణంగా పునాది వద్దే నిలిచిపోయింది. సీసీ రోడ్లు శిథి లమై.. మురుగు పారుదలకు డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తాళ్లపూడి, వేగేశ్వరపురానికి దారేది..

తాళ్లపూడి, జనవరి 18 : మార్పు మాతోనే సాధ్యం అన్నారు.. ఐదేళ్లయినా వైసీపీ నాయకులు ఆ మార్పు ఏమిటో చూపించలేదు. దానికి ఉదాహరణే తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాలు. రెండు గ్రామాల్లో గత ఐదేళ్లుగా మరమ్మతులకైనా రహదారులు నోచుకోలేదు . ఎన్నికలు దగ్గర పడడంతో చట్రు, కంకర కలిపి రహదారులు మరమ్మతులు చేశారు. రోడ్డు మరమ్మతులు చేసి వారమైనా దాటకుండా రోడ్లు ఛిద్రమై కంకర లేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేగేశ్వరపురంలో సచివాలయం, తదితర భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. మండలంలో జగనన్న కాలనీలు సైతం ఎక్కడా పూర్తి కాలేదు.



వెళితే పడతాం : పక్కిలంక-మలకపల్లి రహదారి దుస్థితి

వడిశలేరులో పునాది దాటని పనులు

రంగంపేట.జనవరి 18 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు నాలుగున్నరేళ్లయింది.అయినా ఎక్కడి సమస్యలు అక్కడే. రంగంపేట మండలం వడిశలేరులో ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పునాదికి వేసిన స్తంభాల ఊచలు అలాగే ఉన్నాయి. ఒక్క ప్రభుత్వ భవనం పూర్తి కాలేదు.రంగంపేట మండలంలోనే మొట్ట మొదటిగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టి నాలుగేళ్లకు పూర్తి చేసినా ప్రారంభించలేదు. గ్రామంలో డ్రైనేజీలు లేవు.అరుంధతీనగర్‌లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.ఇలా అభివృద్ధిలో వెనకడుగే.



భవనమేది : వడిశలేరులో పునాది దాటని ప్రభుత్వ భవన నిర్మాణం



మురుగింతేనా : ధుమంతునిగూడెంలో ఇదే డ్రెయినేజీ వ్యవస్థ

ధుమంతునిగూడెంలో..కంపు..కంపు

దేవరపల్లి, జనవరి 18: జగనన్నా ఇదేమిటన్నా.. ఇదీ పల్లెవాసుల మాట.. ఎందుకంటే అభివృద్ధి జాడే లేదు.. చెత్త తీసే నాథులు లేరు. ఏ గ్రామంలో చూసినా అన్నీ సమస్యలే.. నిదుల్లేక సర్పంచ్‌లు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం వెళితే కంపు కొడుతోంది. ఎందుకంటే డ్రెయినేజీలు లేక మురుగు పారేది రోడ్లపైనే. ప్రధాన రహదారిలో సైతం కనీసం డ్రైన్లు నిర్మించలేదు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న కాలనీల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.. వైసీపీకి ఓటేసి అభివృద్ధిలో వెనుకబడ్డామని ప్రజలు వాపోతున్నారు. మండలంలో చాలా గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడే ఉన్నాయి. ఐదేళ్లలో అభివృద్ధి సున్నాగా ఉండడంతో ప్రజలు ఇదేం పాలన అని వాపోతున్నారు.



ప్రాణాలు తీస్తున్నా పట్టదా : అధ్వానంగా అనపర్తి-సామర్లకోట ప్రధాన రహదారి

ఐదేళ్లుగా అనపర్తి రోడ్డింతే!

అనపర్తి, జనవరి 18 : వైసీపీ పాలనలో ఊరు మారిందని గొప్ప చెప్పుకోవడమే తప్ప అనపర్తిలో ఊరూ మారలేదు చివరకు ఊరికెళ్లే దారీ మారలేదు. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలన్నది పెద్దల మాట.. అభివృద్ధిలో రోడ్డును చూసి గ్రామాన్ని చూడాలన్నది నేటి మాట. అయితే అనపర్తిలో మాత్రం రోడ్లను చూస్తే ఐదేళ్లలో చేసిన అభివృద్ధి అర్థమైపోతుంది. అనపర్తి వాసులు సామర్లకోట వేమగిరి రహదారిలో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. అనపర్తికి రోడ్డు మార్గాన వచ్చేందుకు సాక్షాత్తు మంత్రులే భయ పడే పరిస్థితి ఉందంటే అభివృద్ధి ఏమేర జరిగిందో అర్థం చేసుకోవచ్చు

దామిరెడ్డిపల్లి.. మారలేదు..

కడియం, జనవరి 18: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఐదేళ్లవుతున్నా కడియం మండలం దామిరెడ్డిపల్లి మారలేదు.ఆర్‌బీకే, సచివాలయం, పాలసేకరణ కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్నిటికి ఫ్లోరింగ్, కొన్నిటికి విద్యుత్ కనెక్షన్లు వంటివి లేవు. వీటి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడంలేదు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో వీటి నిర్మాణాలు ఎపుడు పూర్తి అవుతాయి?ఇవి వినియోగంలోకి ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఐదేళ్లగా అభివృద్ధి జాడ లేదు.



నిధుల్లేక నీరసం : దామిరెడ్డిపల్లిలో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణం



అన్నకు నివాళి

ఆంధ్రుల ఆత్మగౌరవం అన్న ఎన్‌టీఆర్.. చిరస్మరణీయుడు ఎన్‌టీఆర్.. మహనీయుడు ఎన్‌టీఆర్ అంటూ ఊరూవాడా స్మరించుకున్నారు. ఆయన గొప్పతనాన్ని చాటారు. ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని గురువారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. - 8లో

25న అమలాపురానికి పవన్ : నాదెండ్ల

రాజమహేంద్రవరం,జనవరి18(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేతలు, కార్యకర్తలతో జనసేన నేతలు, కార్యకర్తలు పూర్తిగా కలసి పని చేయాలని జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ , మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ పిలుపు ఇచ్చారు. రాజమహేంద్రవరంలో గురువారం ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కాసేపు సమీక్షించారు. ఈనెల 25న పవన్‌కల్యాణ్ అమలాపురం రానున్నట్టు ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 10 మంది ఇన్‌చార్జిలు హాజరయ్యారు.

ఈ సారి ఎస్సీ ప్రజాప్రతినిధుల

వంతు!



మంత్రి వనిత



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- జిల్లాలో ఇప్పటికే ఇద్దరు బీసీ నేతల బదిలీ
- ఎస్సీ ప్రజాప్రతినిధులదీ ఇదే పరిస్థితి
- గోపాలపురానికి మంత్రి తానేటి వనిత
- కొవ్వూరుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- క్యాడర్‌లో అయోమయం
- మిగిలిన 3 నియోజకవర్గాల్లో టెన్షన్

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి) : వైసీపీలో బడుగునేతల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీసీనేతలైన మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురంలోని తీసేసి, రాజమహేంద్రవరం రూరల్‌కు, ఎంపీ మార్గాని భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తీసేసి రాజమహేంద్రవరం అర్బన్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.ఇవాళ ఎస్సీ నేతల వంతు వచ్చింది. రాష్ట్రం హోం శాఖ మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం బదిలీ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు. అయితే చేసేదేమీ లేక మొత్తం తీసిపారేయకుండా మరో చోటకు బదిలీ అయినా చేశారని.. ఏదో విధంగా తంటాలు పడదామనే అంచనాతో నాయకులు సరిపెట్టు కుంటున్నారు. వీరి బదిలీల గురించి 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. దీంతో జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాలకు వైసీపీ అభ్యర్థులను ఖరారు చేసినట్టు అయింది. మిగతా మూడు చోట్ల ఓసీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కానీ వారి పేర్లేమీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. వారిలో ఎవరికైనా ఎసరెడతారేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేకపోతే ముగ్గురు ఓసీలే కాబట్టి వారి జోలికి వెళ్లే ధైర్యం చేయకపోవచ్చనే ప్రచారమూ ఉంది. అయినా పేర్లు ప్రకటించే వరకూ వారి అనుచరుల్లోనూ టెన్షన్ తప్పదు. ఇక కొవ్వూరులో మంత్రి తానేటి వనితకు చాలా నెలల నుంచి అక్కడి ఒక వర్గంతో పొసగడం లేదు.ఈ నేపథ్యంలో ఆమెకు ఇక్కడ స్థానం ఉండదని చాలా కాలం నుంచి ప్రచారం సాగుతోంది . ఆమెకు గోపాలపురం కొత్తకాదు. ఎమ్మెల్యేగా ఉండగానే వైసీపీలో చేరి కొవ్వూరుకు వచ్చారు. గతంలో అక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. కానీ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు కొవ్వూరు కొత్తే.తానేటిని మార్చడం వల్ల ఆయనను ఇక్కడకు పంపినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇంతకు ముందే వీరిద్దరని తాడేపల్లి పిలిచి ఈ మాట చెప్పారు. గురువారం రాత్రి వీరి పేర్లు అధికారికంగా ప్రకటించారు. కానీ ఇలా మంత్రులు, ఎమ్మెల్యేలను వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తుంటే ప్రజలకు ప్రజాప్రతినిధుల మీద నమ్మకం పోతుంది. గెలిచిన ఎమ్మెల్యే మరోసారి అక్కడ పోటీ చేసే అవకాశం ఉంటుందంటేనే అక్కడ అభివృద్ధి పనులపై దృష్టిపెడతారు. ప్రజలతో కాస్తయినా మమేకం అవుతారు. కానీ ఇలా ఇష్టానుసారం బదిలీలు ఉంటే వీలైనంత సంపాదించుకుని,పెత్తనం చేస్తారే తప్ప, ప్రజల కోసం ఎందుకు పనిచేస్తారనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీ ప్రకటించిన జాబితాలో లోక్‌సభ అభ్యర్థి పేరు కూడా ఉంటుందని ఆయా నేతలు భావించారు.కొద్దిరోజుల కిందట వరకూ సిటీ కోఆర్డినేటర్‌గా పనిచేసిన డా. గూడూరి శ్రీనివాసరావు, రూరల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన చందన నాగేశ్వర్ , మరో డాక్టర్ పద్మలత పేర్లలో ఏదో ఒకటి ఉంటుందని భావించారు. కొందరు నేతలు ఈ నాయకులకు కూడా అదే చెప్పారు.కానీ ఇంకా ఎవరో ఎరూ ప్రకటించకపోవడంతో వారిలోనూ టెన్షన్ మొదలైంది. కార్యకర్తల్లో నైరాశ్యం మొదలైంది. ఏ నాయకుడి వెంట ఉండాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.


జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా లక్ష్మీసూర్యప్రభ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభను నియమిస్తూ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ ఇప్పటి వరకూ జీజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ హోదా కావడంతో ఆమె పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించలేకపోయారు. తాజాగా ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో 13 మంది ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్ల, జీజీహెచ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. పదోన్నతి జాబితాలో ఉన్న డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను నియమించారు. ఈ మేరకు డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ గురువారం కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు.

330 కేసులు.. రూ.6 లక్షలు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కోడి పందేల విషయంలో యంత్రాంగం ప్రతి ఏడాదీ అబాసుపాలవుతోంది.ఈ సారి జిల్లాలో సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. 14, 15, 16న జిల్లా వ్యాప్తంగా పేకాట, గుండాట తదితర జూదంపై 118 కేసులు కట్టి 328 మందిని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి రూ.3,19,479 స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేల విషయంలో 212 కేసులు నమోదయ్యాయి. 535 మందిని అరెస్టు చేసి రూ.3,40,470ల నగదు, 333 కోళ్లు, 350 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో కోట్లాది రూపాయల జూదం జరిగిందనేది బహిరంగ రహస్యం. మొత్తంగా కేవలం రూ.6,59,949 మాత్రమే పోలీసుకు చిక్కింది. ఇక ఒక్క వాహనంపై కూడా కేసు లేదు.

ఏసీబి డీఎస్పీగా శ్రీహరిరాజు



రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్ (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు) డీఎస్పీగా డి.శ్రీహరిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అవినీతిని సహించేది లేదన్నారు. అలాంటి విషయాలపై తనకు నేరుగా ఫోన్ నెం 94404 46160లో సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అవసరమైతే గోప్యంగా ఉంచుతామన్నారు.



తుని పరిసర ప్రాంతంలో దట్టంగా కమ్ముకున్న మంచు

మంచు కురిసే వేళలో..

తుని రూరల్, జనవరి 18: దట్టంగా కురుస్తున్న పొగ మంచు రహదారులను కమ్మేస్తోంది. వాహనదారులకు రోడ్లు కనపడడం లేదు. ఉదయం ఎనిమిది దాటినా మంచు కురుస్తూనే ఉంది. వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తుని పరిసర ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తున్న దృశ్యాలు కనువిందు చేశాయి.

కన్యాకుమారి వరకు యాత్ర

కడియం, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌కు చెందిన నితిన్‌చౌదరి, హ్యూన్‌చౌదరి హిందూ ప్రచారానికి ప్రాధాన్యమిస్తూ చేపట్టిన యాత్ర గురువారం కడియం చేరుకుంది. మధుర ప్రాంతం నుంచి గత ఏడాది 20వ తేదీన మోటారుసైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నాటికి కన్యాకుమారికి చేరుకుంటామని వారు తెలిపారు. దేశంలో ఏఏ దేవాలయాలు ఉన్నాయి? ఆయా ప్రాంతాల్లో భక్తి భావాలు ఎలా ఉంటాయి? అనే వాటికి ప్రాధాన్యమిస్తూ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కన్యాకుమారి నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ ఉత్తరప్రదేశ్ చేరుకుంటామన్నారు. విశాఖపట్నం, కాకినాడ మీదుగా కడియం చేరుకున్నామని, రాజమండ్రి, ఏలూరు మీదుగా విజయవాడ వెళతామన్నారు. బీటెక్ చదువుకున్న వీరిద్దరూ ఈ యాత్ర అనంతరం రాముడు పయనించిన అయోధ్య నుంచి శ్రీలంక వరకు యాత్ర చేపడతామన్నారు.



కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ అడ్డుకుంటున్నారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్


దీక్ష చేస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 : కోడికత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. కోడికత్తి శ్రీను వైజాగ్ జైలులో చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువారం ఆయన సంఘీభావ దీక్ష చేశారు. ఐదేళ్ల నుంచి 307 సెక్షన్ కేసు మీద కోడికత్తి శ్రీను జైలులో మగ్గుతున్నాడన్నారు. కనీసం అతనికి కోర్టులు బెయిల్ మంజూరు చేయడం లేదన్నారు. 307 కేసులో విచారణ జరపకుండా ఇంత కాలం బెయిల్ ఇవ్వకుండా ఉండడం అనేది స్వాతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే మొట్టమొదటి కేసు అని అన్నారు. ఇది చంపాలని చేసింది కాదన్నారు. దీని వల్ల జగన్ లాభం పొందుతాడని శ్రీను ఈ పని చేశాడన్నారు. దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఎన్ఐఏ చెప్పిందన్నారు. అయినా శ్రీనుకు బెయిల్ ఇవ్వలేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ఆలోచన చేయాలన్నారు. ఎంత అధికారం ఉంటే మాత్రం ఇలా బెయిల్ రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. జగన్ వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోతే వెంటనే ఆయనకు ఎన్‌బీడబ్ల్యూ ఇచ్చి కోర్టుకు రప్పించాలన్నారు. రాకపోతే వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిజంగా జగన్‌కు క్షమాగుణం ఉంటే కోర్టుకు రావాలన్నారు. కోడికత్తి శ్రీను కుటుంబం చాలా ఇబ్బందుల్లో ఉందని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కందుల దుర్గేష్‌కు పరామర్శ


దుర్గేష్‌ను పరామర్శిస్తున్న నాదెండ్ల మనోహర్


దుర్గేష్‌తో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. సతీవియోగంతో బాధపడుతున్న దుర్గేష్‌ను జేఎన్ రోడ్డులోని నివాసంలో గురువారం కలిశారు. ఉషారాణి చిత్రపటానికి నివాళులర్పించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, బొల్లినేని హాస్పటల్ వైద్యుడు రామరాజు, రామ్మోహనరావు, చవ్వాకుల కుమార్ తదితరులు పరామర్శించారు.

పోలీసులపై అసత్య ఆరోపణలు తగవు

పెద్దాపురం, జనవరి 18 : పోలీసులపై లేనిపోని ఆరోపణలు తగవని డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె గురువారం మాట్లాడారు. రాజులపూడి ఆరుద్ర అనే మహిళ ఇటీవల పోలీసులపై చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఆరుద్ర తన ఇంటిని విక్రయించే విషయంలో ఆరోపణలు చేసిన కానిస్టేబుళ్లు మెరపల వీరవెంకట సత్యనారాయణ అలియాస్ శివ, మెరపల నాగకన్నయ్యతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అయిన ముత్యాలరావు, న్యాయవాది చిట్టిబాబుపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసును సైతం నమోదు చేశామన్నారు. ఆరుద్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను విచారణకు నియమించామన్నారు. అలాగే దర్యాప్తు తుది దశలో ఉన్న కారణంగా నివేదికను ఉన్నతాధికారులకు అందించిన తర్వాత వారి ఆదేశాల మేరకు సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

రామచంద్రపురం, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం ప్రధాన రహదారి ప్రాఫిట్ మామార్ట్ ఎదురుగా బుధవారం రాత్రి మారుతి 800 కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న విద్యుత్‌నగర్‌కు చెందిన రాంబాబు, ఆయన ఇద్దరు పిల్లలు ఏటీఎం నుంచి డ్రా చేసిన రూ.లక్ష నగదుతో బయటకు వచ్చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలను పట్టణ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. రాత్రి వేళ ప్రధాన రహదారిలో ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



మారుమూల ప్రాంతాలకూ సంక్షేమ ఫలాలు

కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార

పిఠాపురం రూరల్, జనవరి 18: కేంద్రం అమలు చేస్తున్న పథకాల సంక్షేమ ఫలాలు మారుమూల ప్రాంత ప్రజలకు చేరాలన్నదే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆయుష్, శిశు సంక్షేమ శాఖ మంత్రి మహేంద్ర ముంజపార తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2047 నాటికి ప్రపంచంలో అభివృద్ధిలో దేశం అగ్రగామిగా ఉండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా 12 కోట్ల కుటుంబాలు రూ.5 లక్షల మేర ఆరోగ్య ప్రయోజనాన్ని పొందుతున్నాయని తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలోని 26 వేల ప్రభుత్వ, 4,692 ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చునని చెప్పారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా దారిద్ర్యరేఖను దిగువన ఉన్న 5.12 కోట్లు మహిళలకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం ద్వారా ప్రతి వ్యక్తికి అయిదు కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేస్తున్నామని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందిస్తున్నామని వివరించారు. ప్రతి పథకంలోని లక్ష్యాలు, పురోగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం బాలామృతం ద్వారా చిన్నారులకు ఆహారాన్ని అందించగా, ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా జాయింట్ కలెక్టరు ఇలాక్కియ, వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీపీవో కె.భారతిసౌజన్య, కందరాడ సర్పంచ్ నాగభారతి, బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు చిలకూరి రామకుమార్, గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్ర ముంజపార

సందేశాత్మకంగా సాగిన నాటికలు

భోగాపురంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు

పిఠాపురం , జనవరి 18: కుటుంబ సంబంధ బాంధవ్యాల గొప్పతనాన్ని చాటి చెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు రెండో రోజు సందేశాత్మకంగా సాగాయి. ఒకే కడుపున పుట్టిన అన్నచెల్లెలు మధ్య ప్రేమ, అనుబంధం గురించి తెలియచెబుతూ గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. నేటి ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న విలువల నేపథ్యంలో ఇలాంటి బంధాలు ఎంత అవసరమో తెలియజెప్పారు. కష్టకాలంలో చెల్లికి అండగా ఉండే అన్న, వారి కుటుంబాన్ని చక్కదిద్దిన వైనం గురించి నాటిక ద్వారా వివరించారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు.

పెళ్లంటే సర్దుబాటు, సంసారమంటూ దిద్దుబాటు అనే విషయాన్ని వివరిస్తూ గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన నాన్నా..నేనొచ్చేస్తా నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు తమ పిల్లలుకు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చేస్తూ వారిపై మితిమీరిన మమకారాన్ని వాత్సల్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీని ఫలితంగా పెళ్లయిన తర్వాత తమ వైవాహిక బంధంలో వచ్చే చిన్న సమస్యలనే పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లైన కూతురు నాన్నా నేనొచ్చేస్తా అనే మాటకు స్వస్తి పలికి నాన్నా మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు అనే పరిస్థితి రావాలని ఈ నాటిక ద్వారా సందేశాన్ని ఇచ్చారు. గంటి రాజేశ్వరి మూల కథను రాయగా, తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేయగా, అమృత లహరి దర్శకత్వం వహించారు. నాటికల ప్రదర్శన ఏర్పాట్లను కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పర్యవేక్షించారు.


అమృతహస్తం నాటికలో ఓ దృశ్యం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, జనవరి 18: ప్రస్తుత విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్కరణలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు సూచించారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్)డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ రీఫార్మ్స్, ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రసాదరాజు, రీసోర్స్ పర్సన్‌గా బెంగళూరులోని జేవీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ రీసెర్చ్ డీన్ ఎన్ఎంకే భట్టా, హైదరాబాద్‌లోని నార్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అడ్మిషన్స్ విభాగాధిపతి బి.పాండురంగారావు, అతిథులుగా రిజిస్ట్రార్ ఎల్.సుమలత పాల్గొనగా ముఖ్యఅతిథి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఓడీయల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపకులుగా వినూత్న ఆవిష్కరణలు చేపట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించాలన్నారు. ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ విద్యార్థి దశలో వారికి లభించే అవకాశాల గురించి చాలా మందికి తెలియదని వాటిని తెలుసుకుని అందిపుచ్చుకోగలిగితే విజయం దానంతటదే వస్తుందన్నారు. అనంతరం పాండురంగారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉన్నత విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణబాస్కర్, జేవీఆర్ మూర్తి, విభాగాధిపతులు, విశ్వవిద్యాలయ, అనుబంధకళాశాలల నుంచి అధ్యాపకులు. విద్యార్థులు పాల్గొన్నారు.

2 లక్షల మందితో రా కదలిరా సభ

జన సమీకరణపై టీడీపీ నేతల చర్చలు

మండపేట, జనవరి 18: మండపేటలో ఈ నెల 20న జరిగే టీడీపీ రా కదలిరా బహిరంగ సభకు కోనసీమ జిల్లాల్లోని 7 నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది హాజరయ్యే విధంగా టీడీపీ నేతలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం మండపేట పట్టణంలో బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్‌లో పార్లమెంట్ పరిధిలో గల టీడీపీ ఇన్‌చార్జులతో టీడీపీ సీనియర్ నేతలు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం నియోజకవర్గాల వారీగా జన సమీకరణకు సంబంధించి వివరాలు వెల్లడించారు. రాజోలు, గన్నవరం, అమలాపురం, కొత్తపేట నుంచి వచ్చే వాహనాలను ఆలమూరు రోడ్డులో పార్కింగ్ చేసేలా స్థలాన్ని కేటాయించారు. ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట నుంచి వచ్చే వాహనాలకు చంద్రబాబునాయుడు సభాస్థలికి కూతవేటు దూరంలో పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. చంద్రబాబు నాయుడు మండపేట ఆలమూరు బైపాస్‌రోడ్డులో పరిధిలో ఉన్న ఏడిద రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగిన తర్వాత ఆయన నేరుగా బైపాస్ రోడ్డు నుంచి సభస్థలికి చేరుకునేలా రూట్ ఏర్పాటు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

సత్యదేవుని సన్నిధిలో సర్వర్ సమస్య

కొద్దిసేపు నిలిచిపోయిన వ్రతం, దర్శనం టిక్కెట్ల విక్రయాలు

అన్నవరం, జనవరి 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో గురువారం సర్వర్ సమస్యతో కొద్దిసేపు వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సమస్య తీవ్రతరం కాకుండా టిమ్స్ ద్వారా టిక్కెట్లు జారీ చేశారు. మధ్యాహ్నానికి సర్వర్‌లు యథావిధిగా పనిచేయడంతో సేవలు కొనసాగించారు. అయితే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం కోసం విజయవాడలో నెలకొన్న సమస్య మాత్రమేనని ఇక్కడ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. కొద్దిసేపటికి అంతా మామూలైందని ఈ సందర్భంగా తెలిపారు.

భార్యే హంతకురాలు

● ప్రియుడితో కలిసి హత్య చేసిన వైనం ● ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు

పిఠాపురం రూరల్, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడలో సంచలనం కలిగించిన హత్య కేసు మిస్టరీ వీడింది. ఓ వ్యక్తి హత్యకు కారణమైన అతని భార్యతో సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పిఠాపురం సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. విరవాడ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న సిద్ధాంతపు చినఅప్పారావు 10వ తేదీ రాత్రి హత్యకు గురయ్యాడు. దీంతో అతని సోదరి దాకే మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని ఇటుక బట్టీల్లో పనిచేసే సమయంలో చినఅప్పారావు భార్య తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు చిన్నారి, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నురుకుర్తి సురేష్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో మూడేళ్ల క్రితం అప్పారావు తన కుటుంబాన్ని తీసుకుని విరవాడ ఇటుకల బట్టీలో పనికి చేరాడు. అయినప్పటికి చిన్నారి, సురేష్‌ల మధ్య సంబంధం కొనసాగడంతో అప్పారావు, అతడి భార్య చిన్నారి మధ్య పలుమార్లు వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో అప్పారావును అడ్డు తొలగించుకుని ఎక్కడికయినా పారిపోవాలని చిన్నారి,సురేష్ నిర్ణయించుకుని హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇరువురు కత్తితో అప్పారావును విచక్షణారహితంగా నరికి హత్య చేసినట్లు విచారణలో వెల్లడయిందని తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేసి కత్తి, రక్తపు మరకల దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇకపై గుంటూరు వరకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, జనవరి 18: విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగిస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలును గుంటూరు వరకూ పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారి సమాచారాన్ని విడుదల చేశారు 22701, 22702 నంబర్లతో ఈ ఎక్స్‌ప్రెస్ రైలు సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాలలో రాకపోకలు సాగిస్తుంది. 22702 నంబరు గల గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరులో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి విజయవాడకు 5.15 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమండ్రికి రాత్రి 7.28కి చేరుకుని సామర్లకోటకు 8.18కి చేరుతుంది. తునికి 9.04కి చేరుకుని అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్నానికి రాత్రి 10.55కి చేరుతుంది.

22701 నంబరు గల విశాఖ -గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో తెల్లవారుజామున 5.20 గంటలకు బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి మీదుగా తునికి ఉదయం 6.59కి చేరుతుంది. సామర్లకోటకు 7.48కి చేరుకుని రాజమండ్రికి 8.33కి చేరుతుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా గుంటూరుకు మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్లలో సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి తెలిపారు. ఇదిలా ఉండగా 17481 నంబరు గల బిలాస్‌పూర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20,23,27లలో రద్దు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు.

17482 నంబరు గల తిరుపతి-బిలాస్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21,25 తేదీలలో రద్దు చేశారు. 17243 నంబరు గల గుంటూరు-రాయగడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 19 నుంచి 26 వరకూ విజయనగరం వరకే నడుస్తుందని తెలిపారు. 17244 నంబరు గల రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి 27 వరకూ విజయనగరం-గుంటూరు మధ్య మాత్రమే నడుస్తుంది.

చలి మంట అంటుకుని

గిరిజనుడి మృతి



ఎటపాక, జనవరి 18: ప్రమాదవశాత్తు చలి మంట అంటుకుని గిరిజనుడు మృతి చెందాడు. ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ, బండారుగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాదకర సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కుడియం కన్నయ్య (45) రోజు మాదిరిగానే మంచం పక్కన చలిమంట రాజేసి, నిద్రిస్తుండగా కప్పుకున్న దుప్పటి ప్రమాదవశాత్తు చలిమంటపై పడి కన్నయ్యకు నిప్పంటుకుంది. కొద్దిసేపటికి తేరుకుని కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున కన్నయ్య మృతి చెందాడు. ఎస్ఐ కర్రి పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య



రావులపాలెం, జనవరి 18: సాగు కోసం చేసిన అప్పులతో మనస్తాపంతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన పింద్ర రామకృష్ణ (గాంధీ) (76) కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అల్లుడు చనిపోవడంతో కుమార్తె, ఆమె పిల్లలు ఈయనతోనే ఉన్నారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో పెద్ద కుమారుడు ఇంటి వద్దనే ఉంటున్నాడు. తండ్రి, కుమారులు కలిసి పంట సాగు చేసేందుకు అప్పులు చేశారు. ఇటీవల కాలంలో వ్యవసాయం కలిసిరాకపోవడంతో రామకృష్ణ మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రామకృష్ణ మృతిపై పింద్ర లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అంజనేయులు చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పిఠాపురం, జనవరి 18: కాకినాడ జిల్లా పిఠాపురంలోని బైపాస్‌రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. కత్తులగూడెం ప్రాంతంలో నివాసముంటున్న జోగా త్రిమూర్తులు(70) మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా బైపాస్ విరవాడ జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి కాకినాడ వెళ్లుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో త్రిమూర్తులు తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పిఠాపురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఏజెన్సీ సమాచారం

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు


రంపచోడవరంలో ఎన్టీఆర్‌కు నివాళి

రంపచోడవరం, జనవరి 18: దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కిలో బియ్యం రూపాయికే అందించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, జనసేన నాయకుడు శ్రీను, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత, కారం సింహాచలం, వై.నిరంజనీదేవి, దిండి జనార్దన్, సిద్ద వెంకన్నదొర, బొడ్డేటి వీ రబాబు, ధారా వెంకన్న, కొండ్రు చక్రపాణి, సత్య, పెంటమ్మ, గల్లా సత్తిబాబు, పండా బాబి, కుంజం బాపన్న, కోసు నాగన్నదొర, అయినాల పెద్దకాపు, సురేష్, శారపు రాంబాబు, వీరస్వామి పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

రాజవొమ్మంగి జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్ర అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారని అన్నారు. ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్, మాజీ జడ్పీటీసీ జెట్టి అప్పారావు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమానికి కృషి


ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

ఎటపాక, జనవరి 18: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు అన్నారు. గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాన్ని నెల్లిపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఎటపాకలో అరకు పార్లమెంట్ కార్యదర్శి ముద్వా శ్రీను ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, నెల్లిపాక సర్పంచ్ కోర్సా భద్రమ్మ, మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అప్పలస్వామి, తెలుగు యువత అధ్యక్షుడు నలజాల మధు, క్లస్టర్ ఇంచార్జ్ మాచినేని రాజేష్, నాయకులు సున్నం వెంకటరమణ, పాటి చలపతి, కణితి మధు,ఏలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు


ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తూ..

మోతుగూడెం, జనవరి 18: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి ఎన్టీఆర్ భవన్ వద్ద టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలాపు సత్యనారాయణ, గుర్రప్ప, యాకోబు, మాపూరి సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, రత్నంరాజు, దుంగా రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

వై.రామవరం జనవరి 18: పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయి సౌకర్యాలను కల్పించాలని బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది సంబంధిత ఎన్నికల విధుల అధికారులకు రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. వై.రామవరం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల గదులు వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీలోపు అన్ని పోలింగ్ కేంద్రాలలో మరమ్మతులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, డీఆర్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. అలాగే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, డీటీ సుధాకర్, వ్యవసాయ అధికారి ఉషారాణి, అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీవో సుధ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన


అంగన్వాడీల నిరసన

రాజవొమ్మంగి జనవరి 18: రాజవొమ్మంగి మండలంలోని అంగన్వాడీ వర్కర్లు గురువారం షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చేందుకు భారీ ర్యాలీగా ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లారు. సమ్మె నేపథ్యంలో అధికారులు అంగన్వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.. అయితే వివరణ ఇచ్చేందుకు కార్యాలయానికి వెళ్లగా ఐసీడీఎస్ అధికారులు వివరణ పత్రాలు తీసుకుంటాం తప్ప తీసుకున్నట్లు రశీదు ఇవ్వబోమని చెప్పడంతో.. గంటసేపు అంగన్వాడీ వర్కర్లు కార్యాలయం ఎదుటే బైఠాయించి నిరసన చేపట్టారు. గంట సేపటి తర్వాత ఐసీడీఎస్ ఉన్నతాధికారులతో రాజవొమ్మంగి అధికారులు మాట్లాడి అంగన్వాడీ వర్కర్ల షోకాజ్ నోటీసులకు ఇచ్చే వివరణ తీసుకుని, రశీదు ఇస్తామని చెప్పడంతో అంగన్వాడీ వర్కర్లు వివరణ లేఖలను సీడీపీవో దేవమణికి అందించారు. నాయకులు కె.వెంకటలక్ష్మి, చిన్ని కుమారి,సీఐటీయూ నాయకులు పి.రామరాజు తదితరులున్నారు. కాగా టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో నాయకులు దీక్ష శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు.

ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్

రంపచోడవరం, జనవరి 18: ఏజెన్సీలో ఇకపై ఆన్‌లైన్‌లో కూడా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. పీవో మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో విద్యార్థుల విద్యార్హతలను బట్టి నమోదు, రెన్యూవల్ కూడా చేసుకోవచ్చునని సూచించారు. ఎంప్లాయిమెంట్‌కు సంబంధించిన వివరాలను employment.Ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. డీడీ కె.అబుసలాం, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎం.సంగీత, కె.రాంబాబు పాల్గొన్నారు.

నెలాఖరుకు రెండో విడత టిడ్కో ఇళ్లు : ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: ఈ నెలాఖరులోగా సెకండ్ ఫేజ్ లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందిస్తామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బొమ్మూరులో టిడ్కో ఇళ్లను గురువారం పరిశీలించారు. టిడ్కో ఇళ్ల ఫస్ట్ ఫేజ్‌లో కేటాయించిన లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరగా స్వాధీనం చేసుకోవాలన్నారు. తొలి విడతలో ఇచ్చిన ఇళ్లలో ఎవ్వరూ ఉండకపోవడంపై ఆరా తీయగా సౌకర్యాలు లేక ఉండడం లేదని తెలిసిందని, టిడ్కో ఇళ్లలో సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై సమావేశం

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో చూపుదామని కలెక్టర్ డా.కె.మాధవీలత పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం అంబేడ్కర్ విగ్రహ విష్కరణ సమావేశం నిర్వహించారు. జేసీ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు స్ఫూర్తినిచ్చేలా 125 అడుగుల భారీ విగ్రహాన్ని విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, సంక్షేమ అధికారి ఎం.సందీప్ పాల్గొన్నారు.


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి


రంగంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నల్లమిల్లి


కోరుకొండ: దోసకాయపల్లిలో నివాళులర్పిస్తున్న బీవీఆర్ చౌదరి


గోకవరం: మల్లవరంలో ఎన్టీఆర్ వర్ధంతిలో టీడీపీ నాయకులు

మహనీయుడు ఎన్‌టీఆర్

- టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి
- మాజీ ముఖ్యమంత్రికి నివాళి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు


రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: సామాన్యుడు ఉన్నత స్థాయికి చేరుకుని విజయాలు సాధించగలడని అన్న ఎన్‌టీఆర్ నిరూపించారని,తెలుగు ప్రజల ఆత్మవిశ్వాసానికి, ఆత్మగౌరవానికి ఎన్‌టీఆర్ మారుపేరని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణి, ఎం.రాంబాబు, బుడ్డిగ రాధా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దానవాయిపేట సంజీవని బ్లడ్ బ్యాంక్‌లో 150 మంది యువకులు రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి గోరంట్ల బుచ్చయ్య చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రిక్షా కార్మికులతో కలిసి రిక్షా తొక్కారు. వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన మహానుభావుడు ఎన్‌టీఆర్ అని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 24శాతానికి తగ్గించడం వల్ల బీసీలు రాజకీయ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించే పార్టీకే మా మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మందలపు రవి, గన్ని కృష్ణ, వెలుగు బంటి సత్యప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీనివాస్, మజ్జి పద్మావతి, గుత్తుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య పరీక్షలు.. ఎన్‌టీఆర్ స్ఫూర్తితో సమాజానికి సేవలందిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం 42వ డివిజన్‌లో భారీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత ఆయన నివాసం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జీకే స్పందన చారిటబుల్ ట్రస్ట్, ఎన్‌టీఆర్ ట్రస్ట్, జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వైద్య శిబిరాన్ని టీడీపీ జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి ప్రారంభించారు. కంటి-పంటి, గుండె, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఐదు డివిజన్ల నుంచి భారీగా పేదలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని జీఎస్‌ఎల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ తరుణ్, డాక్టర్ సందీప్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ పంతం రజనీ, కాశి నవీన్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డిమణి పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరం, పొలమూరు, చిన పొల మూరు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేపట్టి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడని అన్నారు. పీరా రామచంద్రపురంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, కొప్పవరంలో కర్రి వెంకటరామారెడ్డి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, నూతిక బాబూరావు, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, నీలపాల త్రిమూర్తులు, రాంబాబు, సత్తిబాబు, గిరిబాబు, మల్లిబాబు, మాచిన వెంకన్నచౌదరి, బుల్లిదొర, కాటన్‌దొర పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో వంతెన వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, గొర్రెల త్రిమూర్తులు, జంపా వెంకటరమణ, వానపల్లి శ్రీను, వైదాడి వెంకటేశ్వరరావు, చాగంటి సాయిబాబారెడ్డి, కొండేపూడి చిట్టిబాబు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరం పంచాయతీ సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన ఘనుడు ఎన్టీఆర్ అని, ఆశయ సాధనకు పునరంకితం కావాలన్నారు. అలాగే మండలంలోని చక్రద్వారబంధం, పరిజెల్లిపేట, కానవరం, పల్లకడియం, మల్లంపూడి, తోకాడ, రాధేయపాలెం, నరేంద్రపురం, వెలుగుబంద, నందరాడ, కలవచర్ల, సీతారాంపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, బత్తుల త్రిమూర్తులు, నీలపాల అరవరాజు, బచ్చు ప్రసాద్, నూనె వెంకన్న, దొండపాటి లాజర్, సంగుల శ్రీను, పాతూరి నవీన్‌చౌదరి, ఖండవిల్లి లక్ష్మి పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని మల్లవరం, కృష్ణునిపాలెం, వెదురుపాక గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. మల్లవరం గ్రామాభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఇదుదుల అర్జున్నరావు, సత్యం రాజా, తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియంలో దేవీచౌక్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, జల్లి కృపారావు, వాసంశెట్టి నాగబాబు, వనుం సూరిబాబు, అనుసూరి గోవిందు, వరగోగుల సత్యనారాయణ పాల్గొన్నారు. వేమగిరి బుద్ధవిహార్ తెలుగుపందిరిలో మహోదయ యాజరా ఆధ్వర్యంలో వేమన జయంతి, ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. వేమన, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. బలిరెడ్డి శ్రీనివాస్, కొత్తూరి బాల నాగేశ్వరరావు, ప్రత్తిపాటి నల్లరాజు, మర్రి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని తొర్రేడు, కోలమూరు, కొంతమూరు, బొమ్మూరు, హుకుంపేట, కాతేరు, రాజవోలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దండమూడి సత్యప్రసాద్, కోమలి రామకృష్ణ, దండమూడి శ్రీహరి, గోకా శ్రీను, అప్పారావు, విప్పర్ల వేణుబాబు పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని దోసకాయపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పూలమాలవేసి నివాళులర్పించారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అన్న ఎన్టీఆర్ బాటలో పయనించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, మార్ని రాము, గండి విజయ్‌కుమార్, కంటే నాగేశ్వరరావు, మార్ని వీరాంజనేయులు, అడపా వీరబాబు, మాతా సీతారాముడు, కోర్పు బుజ్జి పాల్గొన్నారు. అలాగే కోరుకొండ, కాపవరం, బూరుగుపూడి, జంబుపట్నం, నర్సాపురం, శ్రీరంగపట్నం, గాదరాడ, రాఘవపురం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు.

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి బొడ్డు వెంకటరమణచౌదరి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస కల్యాణం చిత్రపటాన్ని బహూకరించారు.


కడియంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులో ఎన్టీఆర్ వర్ధంతి


గన్ని కృష్ణ ఏర్పాటు చేసిన శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుకొండలో రక్తదాన శిబిరం

కోరుకొండ, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 19న విజయవాడలో జరగనున్న నేపథ్యంలో కోరుకొండలో గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయం వద్ద జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలానికి చెందిన అనేక మంది పాల్గొని రక్తదానం చేశారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ చారిత్రాత్మకమైన అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్న సందర్భంగా వివిధ సామాజిక కార్యక్రమాలను చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో శిబిరంలో గణేశుల పోశియ్య, అడపా కనకరాజు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, వాకా నరసింహారావు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో అనపర్తి ప్రజాప్రతినిధులు

అనపర్తి, జనవరి 18: తిరుపతిలో ఆరోగ్య గ్రామం పేరిట మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో అనపర్తి నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అనపర్తి జడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, కొమరిపాలెం సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, కొంకుదురు ఎంపీటీసీ పీవీ పాల్గొంటున్నారు. పల్లె ప్రాంతాలను సంపూర్ణంగా అభివృద్ధి చేయడంతో బాటు ప్రజారోగ్యం పట్ల ప్రజా ప్రతినిధులు చేపట్టాల్సిన అంశాలపై ఈ సదస్సు జరుగుతున్నట్లు గీతావరలక్ష్మి తెలిపారు.

గాడాల, నర్సాపురం గ్రామ సమస్యలపై సమీక్ష

కోరుకొండ, జనవరి 18: మండలంలోని గాడాల, నర్సాపురం గ్రామాల్లో సమస్యలపై ఆయా గ్రామ కమిటీలతో గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని అత్యవసరంగా చేయవలసిన పనులను గుర్తించారు. సమావేశంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, కోరుకొండ సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి తేజో వీరన్ననాయుడు, గణేషుల పోశియ్య, తేటపర్తి దుర్గారావు, మారిశెట్టివెంకటేశ్వరరావు, పుల్లెపు సత్తిబాబు, రొంగల వీరవెంకట్రావు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పార్టీ జోన్-2 కోఆర్డినేటర్ రవికుమార్

అనపర్తి, జనవరి 18: తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, ఒక్కచాన్స్‌తో 20 ఏళ్ల వెనుకకు వెళ్లిందని టీడీపీ జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పులగుర్తలో నియోజకవర్గ పరిశీలకుడు మోకా ఆనందసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు, ప్రజల్లో చైతన్యం వచ్చిందని టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని వచ్చేది టీడీపీ జనసేన ప్రభుత్వమేనన్నారు. రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ పులగుర్తకు మండలంతో కనెక్టవిటీ లేని పరిస్థితిలో మాజీ ఎమ్మెల్యే నల్ల మిల్లి మూలారెడ్డి బ్రిడ్జి నిర్మించిన నాటి నుంచి నేటి వరకు గ్రామం అభి వృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ లంపూడి సుధాకరరెడ్డి, సిరపపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, పేరిశెట్టి లాలయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీల నిరవధిక దీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 24 గంటల నిరాహారదీక్షను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి గురువారంతో 38వ రోజు ప్రారంభించారు. సుందరబాబు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జగన్మోహనరెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎస్ఎస్ మూర్తి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సరికొత్త హుండయ్ క్రెటా


మార్కెట్‌లోకి విడుదల చేసిన హుండయ్ క్రెటా

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 : కార్లదిగ్గజం హుండయ్ తన ఎస్‌యూవీ మార్కెట్‌ను సుస్థిర పరుచుకునేందుకు కొత్త అధునాతన క్రిటా కార్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రాజమహేంద్రవరం హుండయ్ షోరూంలో గురువారం ఈ కార్‌ను ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ తటవర్తి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సరికొత్త 6 ఎయిర్ బ్యాగ్స్ , టైప్ సి డ్యూయల్ చార్జింగ్ పోర్ట్స్ ,అడ్వాన్స్ స్మార్ క్యూయిస్ కంట్రోల్ ఫ్రంట్ ఫుట్ వెల్ లైటింగ్, టైర్ ప్రెజర్ మోనిటరింగ్ సిస్టమ్, ఎల్‌ఈడీ లాంప్స్ విత్ కనెక్టడ్ డిజైన్, అడ్వాన్స్ బ్లూలింక్ 70 ప్లస్ ఫీచర్స్‌తో కార్‌ను మార్కెట్‌లోని విడుదల చేశా మని షోరూమ్ గ్రూప్ హెడ్ అఫ్ ఆపరేషన్స్ సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరేష్, రవికుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 18: మండలంలోని హుకుంపేటలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ బి.రామ్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల సమన్వయంతో రూ.7,63,39,885 ఖర్చు చేశారన్నారు. పలు పనులకు సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి రూ.25,750 అపరాధ రుసుము విధించగా రూ.5,435 రికవరీ చేసినట్టు చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సంపత్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు, అంబుడ్స్‌మెన్ జ్యోతి, హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు, ఈసీలు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 18: సతీ వియోగంతో బాధపడుతున్న జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ పరామర్శించడానికి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు గురువారం మధురపూడి విమానాశ్రయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, తోట పవన్‌కుమార్, పలువురు నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరంలోని దుర్గేష్ స్వగృహానికి వెళ్లారు.

నేటి నుంచి కులగణన : మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం నుంచి కులగణన జరగనుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. ధవళేశ్వరంలో గురువారం మత్స్య కారుల సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలు వెనుకబడిన వారు కాదని, వెన్నెముఖ వంటివారన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

21 నుంచి ఉచిత యోగ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని నాళం వారి సత్రం కళ్యాణ మండపంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ఉచిత ధ్యాన ఆరోగ్య యోగ శిక్షణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శ్రీను తెలిపారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 5నుంచి 7:30గంటలు వరకు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8:30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 9440488996 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉచిత న్యాయసేవలు ఖైదీల హక్కు

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి అన్నారు. గురువారం ఆమె కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు తెలియజేయాలని డీఎల్ఎస్ఏ నియమించిన పారాలీగల్ వలంటీర్లకు సూచించారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 19 జనవరి 2024 | 5

రేపు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు కంపెనీల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. వివరాలకు ఫోన్ 7660823903ను సంప్రదించాలన్నారు. యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఇదే కోరుపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు

నేనున్నాను.. నేవిన్నాను.. నేచూశాను.. మీ కష్టాలు తీరుస్తాను.. ఇదీ సుమారు ఐదేళ్ల కిందట సీఎం జగన్ మాట.. అంతా నిజమనుకున్నారు.. ఒక్క ఛాన్స్ అంటే ఓటేసి అధికారం కట్టబెట్టారు.. ఇంకేముంది మన సమస్యలన్నీ జగనన్న చూసుకుంటాడని అనుకున్నారు.. ఐదేళ్లయిపోతుంది.. ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు.. ఊళ్లు అయితే మరీ అధ్వానంగా తయారయ్యాయి.. కనీసం నడవడానికి రోడ్లు లేవు.. మురుగు వెళ్లడానికి డ్రెయినేజీలు లేవు.. పరిష్కరించుకుందామంటే నిధులూ లేవు.. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ సర్కారు దారి మళ్లిస్తుంటే గ్రామాల్లో సమస్యలు కాక ఇంకేముంటాయి.. సంక్రాంతికి పండుగకు ఎక్కడెక్కడి నుంచో పల్లెలకు వచ్చిన బంధువులు మన జిల్లాలో రోడ్లు చూసి ఈ రోడ్లపై ఎలా నడుస్తున్నారని ఆశ్చర్యపోయారంటే పరిస్థితి ఎంత 'దారి'ద్ర్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇక డ్రెయినేజీలను చూసి ముక్కుమూసుకున్నారు.. వై ఏపీ నీడ్స్ జగన్.. నువ్వే మా నమ్మకం జగన్ అంటే ఇదేనా అంటూ సమస్యలను చూసి ప్రశ్నిస్తున్నారు.. ఒకసారి మన జిల్లాలో పల్లెలు ఎలా ఉన్నాయో చూసొద్దాం రండి మరి..!



చిడిపిలో ఈ భవనాల నిర్మాణం ఎప్పుడో

జగనన్నా ఒకసారి చూడన్నా!?

ఊరు..మారలేదు!

- ఐదేళ్లలో అభివృద్ధి సున్నా
- రోడ్లు లేవు.. డ్రెయినేజీల్లేవ్
- అంసపూర్తిగా నిర్మాణాలు
- అందని ఆర్థిక సంఘం నిధులు
- జిల్లాలో ఇదీ పల్లెచిత్రం



కోరుమిల్లిలో ఇదే డ్రెయినేజీ



చిడిపిలో రోడ్డు పక్కనే డంపింగ్‌యార్డ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల జగన్ పాలనలో ఊరుమారలేదు. ఊరు రూపురేఖలు మారలేదు.. అయితే సర్కార్ చేస్తున్న ప్రచారంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఊళ్లలో కనీసం రోడ్లు వేయలేదు. డ్రెయిన్లు పట్టించుకోలేదు. పారిశుధ్యమూ అధ్వానంగానే ఉంది. వానాకాలంలో గ్రామాల్లో మసలలేని పరిస్థితి ఏర్పడింది. శీతాకాలంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇక వేసవి వస్తే తాగునీటికి కటకటే.. జిల్లాలో 300 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రభుత్వం వచ్చిన తర్వాత పన్నులు మాత్రం పెంచారు. రోడ్లు వేయలేదు. విస్తరించలేదు.ఎక్కడైనా ఒకటో అరో రోడ్డు వేసినా బెరమ్స్ పట్టించుకోలేదు. జిల్లాలో నాడు-నేడు కింద కట్టిన వివిధ శాఖల భవనాలు చాలా చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి.హడావిడిగా కొన్ని నిర్మించినా తాళాలు తీయడం లేదు. కేవలం అలంకరణ ప్రాయంగానే మిగిలాయి. కడియం మండలంలో మేజర్ పంచాయతీ కడియపులంకకు కనీసం డ్రెయినేజీ వ్యవస్థలేదు. ఇళ్ల ముందు గోతులు తవ్వుకుని మురుగునీరు పారిస్తారు. మరో మేజర్ పంచాయతీ దివాన్‌చెరువులో కూడా డ్రైనేజి వ్యవస్థలేదు. దివాన్‌చెరువు, శ్రీరామపురం, రఘునాథపురంలో మురికిని రోడ్లపైకి వదిలేస్తారు. జిల్లాలో అనేక పంచాయతీలకు సరైన రోడ్లు లేవు. ఊరు మారిందంటే.. అక్కడ రోడ్లు బాగుండాలి. డ్రైనేజీ వ్యవస్థ ఉండాలి. అపారిశుధ్యం ఉండకూడదు. జిల్లా మధ్య నుంచి గోదావరి ప్రవహిస్తున్నా ఇప్పటికీ గోదావరి నీళ్ల సమీప గ్రామాలకు కూడా లేవు. ఊరును మార్చడానికి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిందేమీ లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను మింగేస్తోంది. కొత్తగా ఏర్పడిన కొన్ని పంచాయతీలకు భవనాలు కూడా లేవు. ఐదేళ్లుగా ఊరు మారిందేంలేదు. సమస్యలతో ఊరు అలసిపోయింది. పరిష్కరించమని గోల పెడుతోంది. కనీస సౌకర్యాలు కల్పించాలని మొరపెడుతోంది.

సమస్యలకు కేరాఫ్ కోరుపల్లి

నిడదవోలు, జనవరి 18 : ఆ గ్రామంలో ఎటు చూసినా దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలే దర్శనమిస్తాయి.. అవి చూసిన వారు అబ్బో అనుకుంటారు.. తీరా గ్రామంలో అడుగుపెడితే అసలు విషయం బోధపడుతుంది. అదేమిటంటే అభివృద్ధి అడుగు కూడా పడలేదని అదే నిడదవోలు మండలంలోని కోరుపల్లి.. సుమారు 2000 జనాభా కలిగిన ఆ గ్రామం అభివృద్ధిలో వెనుకబడి పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లుగా శిలాఫలకాలే తప్ప అభివృద్ధి జాడలేదు. గ్రామంలో ప్రధాన రోడ్లు మొదలుకొని అంతర్గత రోడ్లు అధ్వానమే. ఇక పారిశుధ్యం సంగతి చెప్పనక్కర్లెద్దు..

టీడీపీ గెలిస్తేనే పల్లెల అభివృద్ధి

వైసీపీ రెబల్ అభ్యర్థిగా గెలవడంతో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కక్ష కట్టారు. కనీసం అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలేదు. దీని కారణంగానే మూడు నెలల కిందట టీడీపీలో చేరా. గ్రామం అభివృద్ధి చెందాలంటే టీడీపీ రావాలి.

- గుత్తుల నాగలక్ష్మి, కోరుమిల్లి సర్పంచ్



చిడిపిలో..చింతే!

కొవ్వూరు, జనవరి 18 : హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. అయినా ఆ గ్రామంలో అభివృద్ధి అడు గుపడలేదు. అదే కొవ్వూరు మండలంలోని చిడిపి గ్రామం. నియోజకవర్గ కేంద్రానికి 10 కి.మీ. దూరంలో గ్రామం ఉన్నా పట్టించుకునే నాథులే లేరు. అభివృద్ధి సున్నా.. రోడ్లు లేవు, డంపింగ్ యార్డు లేదు. ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ గ్రామమే కాదు మండలంలో 16 గ్రామాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి.

వీధి దీపాలు వెలిగించలేని దుస్థితిలో ఉన్నాం..

గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిదులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో కనీసం వీధి దీపాలు వెలిగించలేని దుస్థితికి చేరుకున్నాం. గ్రామంలో డ్రైనేజీలు లేవు, చెత్తను వేయడానికి డంపింగ్ యార్డు లేదు. గత నాలుగున్నరేళ్లలో చిడిపి అభివృద్ధిలో మార్పు లేదు. **- పాలడుగుల లక్ష్మణరావు, సర్పంచ్, చిడిపి**





రోడ్డేదన్నా : ఇదే కరిచర్లగూడెం ప్రధాన రహదారి

కష్టాల్లో కరిచర్లగూడెం

గోపాలపురం, జనవరి 18 : మండలంలోని కరిచర్లగూడెం ఒక కుగ్రామం. ఊరి జనాభా కేవలం 1729 మంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉందని ఆ గ్రామ ప్రజలు వైసీపీకి చెందిన అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపించారు. రాష్ట్రంలోనూ, గ్రామంలోనూ అధికార పార్టీకే పట్టం కడితే ఆ గ్రామం ప్రగతిపథంలో పరుగులుపెడుతుందని ఆశించిన ఆ గ్రామ ప్రజలకు ఎదురైంది నిరాశే. జాతీయ రహదారికి సుమారు పర్లాంగు దూరంలో ఉన్న బీటీ రోడ్డు కూడా నిర్మించుకోలేని దుస్థితి ఆ పంచాయతీకి దాపురించింది. నాడు-నేడు ఫేజ్-2లో రూ.36 లక్షలతో మంజూరైన పాఠశాల భవనం అరకొర నిధుల కారణంగా పునాది వద్దే నిలిచిపోయింది. సీసీ రోడ్లు శిథి లమై.. మురుగు పారుదలకు డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తాళ్లపూడి, వేగేశ్వరపురానికి దారేది..

తాళ్లపూడి, జనవరి 18 : మార్పు మాతోనే సాధ్యం అన్నారు.. ఐదేళ్లయినా వైసీపీ నాయకులు ఆ మార్పు ఏమిటో చూపించలేదు. దానికి ఉదాహరణే తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాలు. రెండు గ్రామాల్లో గత ఐదేళ్లుగా మరమ్మతులకైనా రహదారులు నోచుకోలేదు . ఎన్నికలు దగ్గర పడడంతో చ్రబు, కంకర కలిపి రహదారులు మరమ్మతులు చేశారు. రోడ్డు మరమ్మతులు చేసి వారమైనా దాటకుండా రోడ్లు ఛిద్రమై కంకర లేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేగేశ్వరపురంలో సచివాలయం, తదితర భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. మండలంలో జగనన్న కాలనీలు సైతం ఎక్కడా పూర్తి కాలేదు.



వెళితే పడతాం : పక్కిలంక-మలకపల్లి రహదారి దుస్థితి

వడిశలేరులో పునాది దాటని పనులు

రంగంపేట.జనవరి 18 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు నాలుగున్నరేళ్లయింది.అయినా ఎక్కడి సమస్యలు అక్కడే. రంగంపేట మండలం వడిశలేరులో ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పునాదికి వేసిన స్తంభాల ఊచలు అలాగే ఉన్నాయి. ఒక్క ప్రభుత్వ భవనం పూర్తి కాలేదు.రంగంపేట మండలంలోనే మొట్ట మొదటిగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టి నాలుగేళ్లకు పూర్తి చేసినా ప్రారంభించలేదు. గ్రామంలో డ్రైనేజీలు లేవు.అరుంధతీనగర్‌లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.ఇలా అభివృద్ధిలో వెనకడుగే.



భవనమేది : వడిశలేరులో పునాది దాటని ప్రభుత్వ భవన నిర్మాణం



మురుగింతేనా : ధుమంతునిగూడెంలో ఇదే డ్రెయినేజీ వ్యవస్థ

ధుమంతునిగూడెంలో..కంపు..కంపు

దేవరపల్లి, జనవరి 18: జగనన్నా ఇదేమిటన్నా.. ఇదీ పల్లెవాసుల మాట.. ఎందుకంటే అభివృద్ధి జాడే లేదు.. చెత్త తీసే నాథులు లేరు. ఏ గ్రామంలో చూసినా అన్నీ సమస్యలే.. నిధుల్లేక సర్పంచ్‌లు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. దేవరపల్లి మండలం ధూమంతునిగూడెం వెళితే కంపు కొడుతోంది. ఎందుకంటే డ్రెయినేజీలు లేక మురుగు పారేది రోడ్లపైనే. ప్రధాన రహదారిలో సైతం కనీసం డ్రైన్లు నిర్మించలేదు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న కాలనీల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.. వైసీపీకి ఓటేసి అభివృద్ధిలో వెనుకబడ్డామని ప్రజలు వాపోతున్నారు. మండలంలో చాలా గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడే ఉన్నాయి. ఐదేళ్లలో అభివృద్ధి సున్నాగా ఉండడంతో ప్రజలు ఇదేం పాలన అని వాపోతున్నారు.



ప్రాణాలు తీస్తున్నా పట్టదా : అధ్వానంగా అనపర్తి-సామర్లకోట ప్రధాన రహదారి

ఐదేళ్లుగా అనపర్తి రోడ్డింతే!

అనపర్తి, జనవరి 18 : వైసీపీ పాలనలో ఊరు మారిందని గొప్ప చెప్పుకోవడమే తప్ప అనపర్తిలో ఊరూ మారలేదు చివరకు ఊరికెళ్లే దారీ మారలేదు. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలన్నది పెద్దల మాట.. అభివృద్ధిలో రోడ్డును చూసి గ్రామాన్ని చూడాలన్నది నేటి మాట. అయితే అనపర్తిలో మాత్రం రోడ్డును చూస్తే ఐదేళ్లలో చేసిన అభివృద్ధి అర్థమైపోతుంది. అనపర్తి వాసులు సామర్లకోట వేమగిరి రహదారిలో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. అనపర్తికి రోడ్డు మార్గాన వచ్చేందుకు సాక్షాత్తు మంత్రులే భయపడే పరిస్థితి ఉందంటే అభివృద్ధి ఏమేర జరిగిందో అర్థం చేసుకోవచ్చు

దామిరెడ్డిపల్లి.. మారలేదు..

కడియం, జనవరి 18: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఐదేళ్లవుతున్నా కడియం మండలం దామిరెడ్డిపల్లి మారలేదు.ఆర్‌బీకే, సచివాలయం, పాలసేకరణ కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్నిటికి ఫ్లోరింగ్, కొన్నిటికి విద్యుత్ కనెక్షన్లు వంటివి లేవు. వీటి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడంలేదు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో వీటి నిర్మాణాలు ఎపుడు పూర్తి అవుతాయి?ఇవి వినియోగంలోకి ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఐదేళ్లగా అభివృద్ధి జాడ లేదు.



నిధుల్లేక నీరసం : దామిరెడ్డిపల్లిలో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణం



అన్నకు నివాళి

ఆంధ్రుల ఆత్మగౌరవం అన్న ఎన్‌టీఆర్.. చిరస్మరణీయుడు ఎన్‌టీఆర్.. మహనీయుడు ఎన్‌టీఆర్ అంటూ ఊరూవాడా స్మరించుకున్నారు. ఆయన గొప్పతనాన్ని చాటారు. ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని గురువారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. - 8లో

25న అమలాపురానికి పవన్ : నాదెండ్ల

రాజమహేంద్రవరం,జనవరి18(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేతలు, కార్యకర్తలతో జనసేన నేతలు, కార్యకర్తలు పూర్తిగా కలసి పని చేయాలని జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ , మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ పిలుపు ఇచ్చారు. రాజమహేంద్రవరంలో గురువారం ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కాసేపు సమీక్షించారు. ఈనెల 25న పవన్‌కల్యాణ్ అమలాపురం రానున్నట్టు ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 10 మంది ఇన్‌చార్జిలు హాజరయ్యారు.

ఈ సారి ఎస్సీ ప్రజాప్రతినిధుల

వంతు!



మంత్రి వనిత



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- జిల్లాలో ఇప్పటికే ఇద్దరు బీసీ నేతల బదిలీ
- ఎస్సీ ప్రజాప్రతినిధులదీ ఇదే పరిస్థితి
- గోపాలపురానికి మంత్రి తానేటి వనిత
- కొవ్వూరుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- క్యాడర్‌లో అయోమయం
- మిగిలిన 3 నియోజకవర్గాల్లో టెన్షన్

రాజమహేంద్రవరం, జనవరి18(ఆంధ్రజ్యోతి) : వైసీపీలో బడుగునేతల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీసీనేతలైన మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురంలోని తీసేసి, రాజమహేంద్రవరం రూరల్‌కు, ఎంపీ మార్గాని భరత్‌ను ఎంపీ స్థానం నుంచి తీసేసి రాజమహేంద్రవరం అర్బన్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.ఇవాళ ఎస్సీ నేతల వంతు వచ్చింది. రాష్ట్రం హోం శాఖ మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం బదిలీ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరుకు బదిలీ చేశారు. అయితే చేసేదేమీ లేక మొత్తం తీసిపారేయకుండా మరో చోటకు బదిలీ అయినా చేశారని.. ఏదో విధంగా తంటాలు పడదామనే అంచనాతో నాయకులు సరిపెట్టు కుంటున్నారు. వీరి బదిలీల గురించి 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. దీంతో జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాలకు వైసీపీ అభ్యర్థులను ఖరారు చేసినట్టు అయింది. మిగతా మూడు చోట్ల ఓసీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కానీ వారి పేర్లేమీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. వారిలో ఎవరికైనా ఎసరెడతారేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేకపోతే ముగ్గురు ఓసీలే కాబట్టి వారి జోలికి వెళ్లే ధైర్యం చేయకపోవచ్చనే ప్రచారమూ ఉంది. అయినా పేర్లు ప్రకటించే వరకూ వారి అనుచరుల్లోనూ టెన్షన్ తప్పదు. ఇక కొవ్వూరులో మంత్రి తానేటి వనితకు చాలా నెలల నుంచి అక్కడి ఒక వర్గంతో పొసగడం లేదు.ఈ నేపథ్యంలో ఆమెకు ఇక్కడ స్థానం ఉండదని చాలా కాలం నుంచి ప్రచారం సాగుతోంది . ఆమెకు గోపాలపురం కొత్తకాదు. ఎమ్మెల్యేగా ఉండగానే వైసీపీలో చేరి కొవ్వూరుకు వచ్చారు. గతంలో అక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు. కానీ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు కొవ్వూరు కొత్తే.తానేటిని మార్చడం వల్ల ఆయనను ఇక్కడకు పంపినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇంతకు ముందే వీరిద్దరని తాడేపల్లి పిలిచి ఈ మాట చెప్పారు. గురువారం రాత్రి వీరి పేర్లు అధికారికంగా ప్రకటించారు. కానీ ఇలా మంత్రులు, ఎమ్మెల్యేలను వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తుంటే ప్రజలకు ప్రజాప్రతినిధుల మీద నమ్మకం పోతుంది. గెలిచిన ఎమ్మెల్యే మరోసారి అక్కడ పోటీ చేసే అవకాశం ఉంటుందంటేనే అక్కడ అభివృద్ధి పనులపై దృష్టిపెడతారు. ప్రజలతో కాస్తయినా మమేకం అవుతారు. కానీ ఇలా ఇష్టానుసారం బదిలీలు ఉంటే వీలైనంత సంపాదించుకుని,పెత్తనం చేస్తారే తప్ప, ప్రజల కోసం ఎందుకు పనిచేస్తారనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీ ప్రకటించిన జాబితాలో లోక్‌సభ అభ్యర్థి పేరు కూడా ఉంటుందని ఆయా నేతలు భావించారు.కొద్దిరోజుల కిందట వరకూ సిటీ కోఆర్డినేటర్‌గా పనిచేసిన డా. గూడూరి శ్రీనివాసరావు, రూరల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన చందన నాగేశ్వర్ , మరో డాక్టర్ పద్మలత పేర్లలో ఏదో ఒకటి ఉంటుందని భావించారు. కొందరు నేతలు ఈ నాయకులకు కూడా అదే చెప్పారు.కానీ ఇంకా ఎవరో ఎరూ ప్రకటించకపోవడంతో వారిలోనూ టెన్షన్ మొదలైంది. కార్యకర్తల్లో నైరాశ్యం మొదలైంది. ఏ నాయకుడి వెంట ఉండాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా లక్ష్మీసూర్యప్రభ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభను నియమిస్తూ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ ఇప్పటి వరకూ జీజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ హోదా కావడంతో ఆమె పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించలేకపోయారు. తాజాగా ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో 13 మంది ప్రొఫెసర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. పదోన్నతి జాబితాలో ఉన్న డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను నియమించారు. ఈ మేరకు డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ గురువారం కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు.

330 కేసులు.. రూ.6 లక్షలు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కోడి పందేల విషయంలో యంత్రాంగం ప్రతి ఏడాదీ అబాసుపాలవుతోంది.ఈ సారి జిల్లాలో సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. 14, 15, 16న జిల్లా వ్యాప్తంగా పేకాట, గుండాట తదితర జూదంపై 118 కేసులు కట్టి 328 మందిని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి రూ.3,19,479 స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేల విషయంలో 212 కేసులు నమోదయ్యాయి. 535 మందిని అరెస్టు చేసి రూ.3,40,470ల నగదు, 333 కోళ్లు, 350 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో కోట్లాది రూపాయల జూదం జరిగిందనేది బహిరంగ రహస్యం. మొత్తంగా కేవలం రూ.6,59,949 మాత్రమే పోలీసుకు చిక్కింది. ఇక ఒక్క వాహనంపై కూడా కేసు లేదు.

ఏసీబీ డీఎస్పీగా శ్రీహరిరాజు



రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్ (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు) డీఎస్పీగా డి.శ్రీహరిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అవినీతిని సహించేది లేదన్నారు. అలాంటి విషయాలపై తనకు నేరుగా ఫోన్ నెం 94404 46160లో సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అవసరమైతే గోప్యంగా ఉంచుతామన్నారు.

‘జయహో బీసీ’ విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, జనవరి 18: నియోజకవర్గంలో జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు చెప్పారు. గురువారం వేలివెన్నులో జరిగిన జయహో బీసీ సమీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమానికి అన్ని గ్రామాల బీసీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరయ్యేలా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల వారీగా సమీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ బీసీ నాయకులు, కార్యకర్తలు, బీసీ వర్గానికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ.. పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొవ్వూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కొవ్వూరు, జనవరి 18: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. గురువారం కొవ్వూరులోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఇంకనూ ఏమైనా పనులు చేపట్టవలసి ఉంటే వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెట్‌వెల్ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎస్‌ఈబీ దాడులు

కొవ్వూరు, జనవరి 18: కొవ్వూరులో ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి 28 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి.సత్యనారాయణ తెలిపారు. గురువారం సిద్ధా సత్యనారాయణను అరెస్టు చేసి 23 మద్యం సీసాలు, తాళ్లపూడి మండలం పెద్దేవంలో తిగిరిపల్లి జయశేఖర్‌ను అరెస్టు చేసి 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

38 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు..

సత్యవాడ జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సత్యవాడ హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఉండ్రాజవరం, జనవరి 18: మండలంలోని సత్యవాడ హైస్కూల్లో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. 38 ఏళ్ల క్రితం పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను, అల్లరి చేష్టలను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకుని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

నేటి నుంచి కులగణన : మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం నుంచి కులగణన జరగనుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. ధవళేశ్వరంలో గురువారం మత్స్య కారుల సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలు వెనుకబడిన వారు కాదని, వెన్నెముఖ వం టివారన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

21 నుంచి ఉచిత యోగ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని నాళం వారి సత్రం కళ్యాణ మండపంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ఉచిత ధ్యాన ఆరోగ్య యోగ శిక్షణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శ్రీను తెలిపారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 5నుంచి 7:30గంటలు వరకు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8:30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 9440488996 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉచిత న్యాయసేవలు ఖైదీల హక్కు

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి అన్నారు. గురువారం ఆమె కేంద్ర కారాగాన్ని సందర్శించారు. అందుబాటు లో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు తెలియజేయాలని డీఎల్ ఎస్ఏ నియమించిన పారాలీగల్ వలంటీర్లకు సూచించారు. వారి సమస్య లను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

టీడీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పార్టీ జోన్-2 కోఆర్డినేటర్ రవికుమార్



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనపర్తి, జనవరి 18: తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, ఒక్కచాన్స్‌తో 20 ఏళ్లు వెనుకకు వెళ్లిందని టీడీపీ జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పులగుర్తలో నియోజకవర్గ పరిశీలకుడు మోకా ఆనందసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు, ప్రజల్లో చైతన్యం వచ్చిందని టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని వచ్చేది టీడీపీ జనసేన ప్రభుత్వమేనన్నారు. రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ పులగుర్తకు మండలంతో కనెక్టవిటీ లేని పరిస్థితిలో మాజీ ఎమ్మెల్యే నల్ల మిల్లి మూలారెడ్డి బ్రిడ్జి నిర్మించిన నాటి నుంచి నేటి వరకు గ్రామం అభి వృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ లంపూడి సుధాకరరెడ్డి, సిరపపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, పేరిశెట్టి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడి చావుకు కారణమైన..

ఇద్దరు వ్యక్తులకు జైలు

రాజమహేంద్రవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బాలుడి చావుకు కారణమైన ఇద్దరు వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించింది. త్రీటౌన్ సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లెమొగ్గల శివ, లక్ష్మి దంపతులు కాకినాడలో నివాసం ఉండేవారు. అబ్బాయి పుట్టిన ఆరేళ్లకు మనస్పర్థలు రావడంతో లక్ష్మి కొడుకు మంజునాథతో విడిగా జీవించేది. ఈ క్రమంలో సామర్లకోటకు చెందిన దోనం దాసుతో పరిచయం ఏర్పడింది. రాజమహేంద్ర వరంలోని సీతంపేటలో ఇల్లు అద్దెకు తీసుకొని ఆమెతో దాసు సహజీవనం సాగించేవాడు. 2021 జూలై 27 చిన్న కారణంతో మంజునాథను దాసు దవడ, తలపై గట్టిగా కొట్టడంతో నోటి నుంచి నురగ వచ్చి, మలవిసర్జన జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేరం రుజువు కావడంతో దాసుకు ఐదేళ్లు, లక్ష్మికి మూడేళ్ల శిక్ష విధిస్తూ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్సు జడ్జి బి.పద్మ తీర్పు చెప్పారు. ఇద్దరికీ రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 3నెలలు అదనంగా శిక్ష విధించాలని ఉత్తర్వులిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ వాదనలు వినిపించగా, హెచ్‌సీ ఎస్.వెంకటేశ్వరరావు విచారణ సమయంలో సాక్షులను ప్రవేశపెట్టడంలో ప్రత్యేక చొరవ చూపారని సీఐ తెలిపారు.

కాపు సంఘం గోపాలపురం ఉపాధ్యక్షుడిగా ఉన్నమట్ల



నల్లజర్ల, జనవరి 18: నియోజక వర్గ ఉపాధ్యక్షుడిగా నల్లజర్లకు చెందిన ఉన్నమట్ల వెంకటేశ్వరరావును నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.



కొవ్వూరులో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు



కొవ్వూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



తాళ్లపూడి: దుప్పట్లు పంపిణీ చేస్తున్న యువగళం టీం

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్
- తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడి వర్ధంతి
- మాజీ ముఖ్యమంత్రికి నివాళి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

గోపాలపురం, జనవరి 18: అటు సినిమా రంగంలోను, ఇటు రాజకీయ రంగంలోను తనదైన శైలిలో విశేష సేవలందించి రాష్ట్ర ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్‌టీఆర్ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలుచోట్ల గురువారం నిర్వహించారు. గోపాలపురం పాతబస్టాండ్‌లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ ఆధ్వర్యంలో జవహర్, నల్లమిల్లి, మద్దిపాటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా విస్తరింపజేసిన మహోన్నతుడు ఎన్‌టీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో జ్యేష్ట శ్రీధర్, రాము, కూనపం ప్రసాద్‌బాబు, మద్దిపాటి రమేష్, జ్యేష్ట శ్రీను, పడమట శ్రీను, బాలిన రాము, కొడవటి గంగరాజు, ఉండవల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా రఘునాయక, ఎల్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ యద్రప్రగడ మంగారావు.. సాగిపాడు లెప్రసీ కాలనీలో రొట్టెలు, పండ్లు, ఇతర పానియాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బండారు గనిరాజు, ముప్పిడి అనీల్‌కుమార్, పిల్లి కృష్ణ, వెల్లంకి జయశివసూర్యం, షేక్ మస్తాన్, చాపల శేఖర్ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే బస్టాండ్ సెంటర్, విజయవిహార్ సెంటర్‌లలో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, రాజాన శ్రీనివాసరావు, మద్దుకూరి సురేష్, జీజీ చలం, మరపట్ల కళాధర్, వేమగిరి వెంకట్రావు, గెల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. మైగాపుల సంపతి, గుండుబోగుల ప్రసాదు, కడలి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అన్నదేవరపేటలో యువగళం టీం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు, పంచాయతీ, ఆటో కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. కూచిపూడి హనుమంతరావు, జీవీ ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, తోండెపు భరత్ పాల్గొన్నారు. మలకపల్లిలో చెరుకూరి వెంక్రావు, రాపాక తిలక్ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మద్దిపాటి ప్రకాశం, రాగు సత్యనారాయణ పాల్గొన్నారు. పెద్దేవంలో జరిగిన కార్యక్రమంలో రేఖపల్లి ముత్యాలరావు, బోడపాటి కాశీ, తిగిరిపల్లి గోపి పాల్గొన్నారు. తాడిపూడిలో నామా సురేంద్ర, సిద్దన రాధాకృష్ణ ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. తిరుమలశెట్టి సత్యనారాయణ, అక్కాబత్తుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నల్లజర్లకు చెందిన కోరా కన్నయ్య కుమారుడు ఎన్ఆర్ఐ కోరా వంశీ అయ్యవరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. దీనికి జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగు జాతికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్టీఆర్ నాడు అనేక పథకాలు ప్రవేశపెట్టి దేశం గర్వించదగిన ముఖ్యమంత్రిగా పేరొందన్నారు. కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, కోరా కన్నయ్య, చుక్కా శ్రీను, గుడిసే సత్యనారాయణ, విడియాల శ్రీను, ఆలపాటి రామకృష్ణ పాల్గొన్నారు. అనంతపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ నివాళులర్పించారు. గురిమిల్లి శ్రీనివాసరావు, వల్లిరెడ్డి సతీష్, రాజా బ్రదర్స్, గెడ్డాపు సూర్యనారాయణ పాల్గొన్నారు. నల్లజర్లలో నిమ్మలపూడి ప్రసాద్, యలమాటి శ్రీను, కండెపు వెంకటరత్నం ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. బీసీ కాంపెక్స్, జాషువా నగర్, చెక్ పోస్టు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు ముళ్ళపూడి కృష్ణమూర్తి, విడియాల శ్రీను, ఆలపాటి రామకృష్ణ నివాళులర్పించారు.

చాగల్లు: చాగల్లులో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆళ్ళ హరిబాబు, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబ దుర్గ పాల్గొన్నారు. నెలటూరులో తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, నందిగం శ్రీను, తాళ్ళూరి శ్రీనివాసరావు, ఊనగట్లలో బొల్లిన శివనాగేంద్ర, పెనుమర్తి కిషోర్, కారింకి సత్యనారాయణ, నందిగంపాడులోని కార్యక్రమంలో నందిగం సూర్యారావు, కామేశ్వరరావు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. చంద్రవరంలో మద్దిపాటి వీరరాఘవులు, మల్లవరంలో కోడూరి కాశి, దారవరంలో బొడ్డు రాజు, బ్రాహ్మణగూడెంలో గారపాటి కాశివిశ్వనాథం ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

పెరవలి: మండలంలోని పెరవలిలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, తీపర్రులో కుందుల వీర వెంకట సత్యనారాయణ ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కుల, మత, వర్గాలకు తీతంగా అందరి అభిమానాన్ని ఆయన చూరగొన్నారని అన్నారు. ఈ సందర్భంగా పెరవలిలో టీడీపీ నాయకుడు సలాది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూపతిరాజు రవివర్మ, అతికాల రామకృష్ణమ్మ, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు, కంటిపూడిసూర్యనారాయణ, నందమూరి నారాయణరావు, జనసేన నాయకుడు పిప్పర రవి పాల్గొన్నారు. అనంతరం పెరవలిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీల శిబిరం వద్దకు వెళ్లి తమ సంఘీభావం తెలిపారు.

నిడదవోలు: నిడదవోలులోని చాగల్లు రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాలలతో నివాళులర్పించారు. ఎన్టీఆర్ ప్రజలకు సేవ చేసేందుకే టీడీపీ స్థాపించి ముఖ్యమంత్రిగా ఎన్నికై పేదల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, నాయకులు తిరుపతి సత్యనారాయణ, షాజహాన్, తన్నీడి బోసు, సతీష్ పాల్గొన్నారు. అలాగే స్థానిక తీరుగూడెంలో, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు కుందుల సత్యనారాయణ పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకలపూడి వెంకటరత్నం, పేరూరి సాయిబాబా, అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధ, బోసు, వెంకట్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా చిన్నాయిగూడెంలో తీవ్ర అనారోగ్యానికి గురైన వెంగల అబ్బులును ముప్పిడి పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ గడా మురళీఅజిత్ కుమార్ రూ.10 వేల అందజేశారు. పల్లంట్లలో కొయ్యలమూడి చినబాబు, సుధారాణి, గౌరీపట్నంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, యాగంటి సాయిబాబు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు ఎన్‌టీఆర్‌కు నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉండ్రాజవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కాల్దరిలో మాజీ జడ్పీటీసీ కోమట్లపల్లి వెంకసుబ్బారావు పూలమాలవేసి నివాళులర్పించారు. పాలంగి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులకు టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ దుప్పట్లు, పండ్లు పంచారు. భోజనం అందజేశారు. పసలపూడి, సూర్యారావుపాలెం, పాలంగి, చివటం, తాడిపర్రు, మోర్త, చిలకపాడు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.



నల్లజర్ల: అయ్యవరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వంశీ, బాపిరాజు



నిడదవోలు: తీరుగూడెంలో ఎన్టీఆర్ నివాళులర్పిస్తున్న కుందుల సత్యనారాయణ



ఉండ్రాజవరం: వేలివెన్నులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



దేవరపల్లిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



గోపాలపురంలో నేలపై అన్నం కలుపుకుని తింటున్న అంగన్వాడీలు

సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ

కొవ్వూరు, జనవరి 18: అంగన్వాడీల చేపట్టిన సమ్మె బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 38వ రోజుకు చేరింది. సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ ఎక్కడికక్కడ లబ్ధిదారులు, అనుబంధ, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదుల మద్దత్తుతో కనీస వేతనం చెల్లించే వరకు పోరాడుతామన్నారు. అంగన్వాడీల ఉద్యమానికి మద్దతుగా కోటి సంతకాల సేకరణ నిరవధికంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు నాయకురాలు ఈమని మల్లిక, అంగన్వాడీలు వి.శ్రీదేవి, ఎస్.మధురవల్లి, ఎ.నరసమాంబ, ఎస్.శాంతకుమారి, కేసీ లక్ష్మి, పి.చైతన్య, సీహెచ్.బ్రహ్మమ్మ, బి.ఉష, ఎ.భ్రమరాంబ పాల్గొన్నారు. ఇదిలాఉండగా సమ్మె శిబిరానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు చేరుకుని మద్దతు తెలిపారు. పార్టీ నాయకుడు మన్నవ రఘురాం మాట్లాడుతూ అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 25న కొవ్వూరు మెరకవీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద జరగనున్న ఆప్ సదస్సులో అంగన్వాడీలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి కాళ్ళూరి కృష్ణమోహన్, యార్లగడ్డ శ్రీనివాస్, వరప్రసాద్, నాగులపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణ, మండలంలోని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు తమ పోరాటానికి సంఘీభావంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, వర్కర్లు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో చేపట్టిన సమ్మె అంగన్వాడీ వర్కర్ల నియోజకవర్గ నాయకురాలు టీపీ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని 38రోజులుగా వివిధ రూపాల్లో నిరసన చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: కడుపునిండా అన్నం తిని 38 రోజులయ్యిందని అంగన్వాడీలు సీఎం జగన్‌కు గుర్తు చేశారు. సమ్మె ప్రారంభించి గురువారానికి 38వ రోజుకు చేరుకున్న సందర్భంగా కఠిక నేలపై అన్నం కలుపుకుని తింటూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంతో పండుగ పూట పస్తులుండి నిరసనలు చేసే దుస్థితి అంగన్వాడీలకు నెలకొందన్నారు. సమ్మెకు రోజులు పెరుగుతున్న కొద్ది జగన్ పదవికి రోజులు తగ్గుతున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



నిడదవోలులో అంగన్‌వాడీల ర్యాలీ

కోడి కత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా

జగన్ అడ్డుకుంటున్నారు?

- కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని హర్షకుమార్ దీక్ష
- సీఎం జగన్‌కు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయాలని డిమాండ్



దీక్ష చేస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: కోడికత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ డిమాండ్ చేసారు. కోడికత్తి శ్రీను వైజాగ్ జైలులో చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువా రం సంఘీభావ దీక్ష చేశారు. ఐదేళ్ళ నుంచి 307 కేసు మీదు కోడికత్తి శ్రీను జైలులో మగ్గుతున్నాడన్నారు. కనీసం అతనికి కోర్టులు బెయిల్ మంజూరు చేయడం లేదన్నారు.307 కేసులో విచారణ జరపకుండా ఇంత కాలం బెయిల్ ఇవ్వకుండా ఉండడం అనేది స్వాతంత్ర భారతదేశం చరిత్రలో ఇదే మొట్టమొదటి కేసు అని ఘంటాపథంగా చెప్పగలనన్నారు. గాయం బట్టి సెక్షన్ పెడతారు కాని జగన్‌కు భుజంపై గీసుకుందని ఇది చంపాలని చేసిందికాదన్నారు. దీని వల్ల జగన్ లాభం పొందుతాడని శ్రీను ఈ పని చేశాడన్నారు. దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఎన్ఐఏ చెప్పిందన్నారు. అయినా శ్రీనుకు బెయిల్ ఇవ్వలేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ఆలోచన చేయాలన్నారు. ఎంత అధికారాలు ఉంటే మాత్రం ఇలా బెయిల్ రాకుండా అడ్డుకో కూడదన్నారు. కోడికత్తి శ్రీనుకు జరిగిన అన్యాయంపై అతనే జైలులో న్యాయం చేయాలని నిరవధిక దీక్ష చేస్తున్నాడు.అతనికి సంఘీభావంగా తాను దీక్ష చేస్తున్నానన్నారు. జగన్ వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోతే వెంటనే ఆయనకు ఎన్‌బీడబ్ల్యూ ఇచ్చి కోర్టుకు రప్పించాలన్నారు. రాక పోతే వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిజంగా జగన్‌కు క్షమా గుణం ఉంటే కోర్టుకు రావాలన్నారు. కోడికత్తి శ్రీను కుటుంబం చాలా ఇబ్బందుల్లో ఉందని అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.





దుర్గేష్‌కు నాదెండ్ల, ముద్రగడ పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. సతీ వియోగంతో బాధపడుతున్న దుర్గేష్‌ను జేఎన్ రోడ్డులోని నివాసంలో గురువారం కలిసి ఉషారాణి చిత్రపటానికి నివాళులర్పించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామసుబ్రహ్మణ్యం, బొల్లినేని హాస్పటల్ వైద్యుడు రామరాజు, రామ్మోహనరావు, చవ్వాకుల కుమార్ పరామర్శించారు.

నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 18: సతీ వియోగంతో బాధపడుతున్న జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ పరామర్శించడానికి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు గురువారం మధురపూడి విమానాశ్రయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, తోట పవన్‌కుమార్, పలువురు నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరంలోని కందుల దుర్గేష్ స్వగృహానికి వెళ్లారు.